క్లుప్తంగా

అంకితభావంతోనే ఉద్యోగులకు గుర్తింపు



రాజిరెడ్డిని సన్మానిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు, స్థానికులు

కుల్కచర్ల: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తుందని చౌడాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాము, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం పేర్కొన్నారు. గురువారం చౌడాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉత్తమ కార్యదర్శిగా ఎంపికైన రాజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామస్తుల అభ్యున్నతికి సేవాభావంతో నిర్విరామంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, రాములు, చిన్నయ్య, గోపాల్, నర్సింలు, మణికంఠ, సాయి, బొర్ర రమేష్, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య



పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య

పరిగి: పరిసరాలను తప్పనిసరిగా శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రజలకు పురపాలక సంఘం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తప్పకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటివద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలని పేర్కొన్నారు. దీనికోసం చెత్త డబ్బలను కూడా అందించామని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సహకరించి పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్



పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్న ఆంజనేయులు తదితరులు

కుల్కచర్ల: రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అధిక దిగుబడి వచ్చేందుకు జనుము, జీలుగ విత్తనాలు లాభసాటిగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయితేజ, స్థానిక నాయకులు చంద్రభూపాల్, కృష్ణయ్య, వేముల రాములు, సోమలింగం, భాస్కర్, షర్ఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



గోమాతకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న అజయ్‌ప్రసాద్

బషీరాబాద్: హిందువులు ఆవును అమ్మలా భావించి పూజిస్తారు. బషీరాబాద్‌కు చెందిన కరుణ, అజయ్‌ప్రసాద్ వ్యవసాయం, పశుపోషణ చేస్తుంటారు. సుమారు 25 ఆవులను పోషిస్తున్నారు. ఇందులో గౌరి అనే గోవు అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం కన్నీరపర్యంతమైంది. మృతి చెందిన గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు పూర్తిచేశారు.

నేటి నుంచి దేవాలయ వార్షికోత్సవాలు

శంకర్‌పల్లి: పట్టణంలో అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవాలు ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. 6వ తేదీ శుక్రవారం గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహనం, క్షేత్రపాలక దేవతారాధన తదితర పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

సర్కారు బడుల్లో ప్రవేశాలే లక్ష్యంగా..

ప్రాథమిక పాఠశాలల్లోనూ నోట్‌బుక్కుల పంపిణీ
- పేద విద్యార్థులకు చేకూరనున్న ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



ఎంఆర్సీకి వచ్చిన పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులకు అందిస్తున్న ఎంఈఓ వెంకటస్వామి (ఫైల్)

దౌల్తాబాద్: ఇప్పటి వరకు 6నుంచి 10వతరగతి వరకు నోట్‌బుక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ప్రాథమిక తరగతులు 1నుంచి 5వరకు కూడా సరఫరా చేయనున్నారు. సర్కారు బడుల్లో ప్రవేశాలు పెంపే లక్ష్యంగా అనేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. ఉన్నత పాఠశాలల వారికి రెండేళ్లుగా నోట్‌బుక్కులు అందజేస్తున్నారు. తాజాగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సైతం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకు నోట్‌బుక్కులు పంపిణీ చేస్తున్నారు. గోదాములు, ఎంఆర్సీలు కాకుండా నేరుగా విద్యాశాఖ నుంచి ఆయా పాఠశాలలకు వీటిని సరఫరా చేస్తున్నారు. బడులు ప్రారంభించిన రోజు పుస్తకాలు పంపిణీ చేస్తారు. దీంతో ప్రాథమిక విద్యార్థులకు కూడా మేలు చేకూరనుందని విద్యాశాఖ అధికారులు వివరించారు.

మండలంలో..

దౌల్తాబాద్ మండలంలో 45 ప్రాథమిక, 1కేజీబీవీ పాఠశాలలున్నాయి. ఇందులో 1నుంచి 10వరకు 3,570మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ తెలుగు, ఆంగ్లం, ఉర్దు మాధ్యమంలో పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారు. గతేడాది 6నుంచి 10వతరగతి వరకు ఒక్కో విద్యార్థికి 7నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలలకు ఇవ్వనుండడంతో 1నుంచి 5వతరగతి వరకు చదువుతున్న దాదాపు వెయ్యిమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. 1నుంచి 2తరగతి వారికి మూడు, 3నుంచి 5వరకు నాలుగు చొప్పున నోట్‌బుక్కులు అందించనున్నారు.

80శాతం పుస్తకాలు పంపిణీ

బడులు తెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు అందించాలనే ఉద్దేశంతో అన్ని పాఠశాలలకు 80శాతం మేర పుస్తకాలు పంపిణీ చేశాం. క్యూ ఆర్ కోడ్, ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో వచ్చిన పుస్తకాలను పాఠశాలల ప్రారంభం రోజు విద్యార్థులకు అందిచనున్నాం.
– వెంకట్‌స్వామి, ఎంఈఓ, దౌల్తాబాద్

పండగ తర్వాతే పశువుల సంత



ప్రధాన ద్వారానికి తాళంవేసి, ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

ఉత్తర్వులు జారీ చేసిన మార్కెటింగ్ శాఖ

తాండూరు: తాండూరులో గురువారం నిర్వహించే పశువుల సంతకు బక్రీద్ ఎఫెక్ట్ పడింది. పండగ సందర్భంగా తెల్లజాతి పశువులు, ఆవులు, ఎద్దులతో పాటు ఒంటేల వధను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రతీవారం నిర్వహించే పశువుల సంతలో క్రయ విక్రయాలు నిర్వహిస్తారని ముందస్తుగా మార్కెటింగ్ శాఖ అధికారులు మూసివేశారు. ప్రధాన ద్వారానికి మార్కెట్ కమిటీ అధికారులు తాళం వేసి, బంద్ సమాచారానికి సంబంధించిన వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. తిరిగి పండగ తర్వాత ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

గోవులను అక్రమంగా తరలిస్తే చర్యలు

పూడూరు: గోవులను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. పశువుల సంతకు గోవులను తరలిస్తే అందుకు సంబంధించిన అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలిస్తే సంబంధిత పశు వైద్యాధికారి ధ్రువీకరించిన పత్రాలు ఉండాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆయన రూ.1 లక్ష 16 వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ఆగీరు రవికుమార్‌గుప్తా, నర్సింహారెడ్డి, శ్రీరాములు, దశరథ్‌నాయక్, మహేశ్, శ్రీశైలంయాదవ్, శేఖర్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో భక్తులు



శ్రీవారి సేవలో మండల భక్తులు

బొంరాస్‌పేట: మానవ సేవయే మాధవ సేవగా భావించిన గోవింద భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి సేవలో వారం రోజుల పాటు భక్తులకు సేవలందించి తరించారు. గత నెల 26 నుంచి వారం రోజుల పాటు ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో 14 మంది రేగడి మైలారం నుంచి విష్ణువర్ధన్, మంగలి వెంకటయ్య, మెంబరు వెంకటయ్య, కుమ్మరి రమేశ్, పెద్ద పెంటయ్య, ప్రశాంత్, నాగేశ్, మోత్కూరు నుంచి కృష్ణయ్య, లక్ష్మయ్య, ముశ్రీఫా కృష్ణయ్య, తిర్మలాపూర్ వెంకటయ్య, చిల్మల్‌మైలారం నుంచి బాల్‌రాజ్, నవీన్, శ్రీనివాస్‌లు వెళ్లారు. అక్కడ సేవలో పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలోని వైకుంఠం-2, ఏకాంతసేవ ప్రాంతాల్లో భక్తులకు సేవలందించారు. అనంతరం వీరికి ఉచిత దర్శనంతోపాటు విహారయాత్రకూడా ఉండటం సంతోషంగా ఉందని సేవకు వెళ్లిన భక్తులు విష్ణువర్ధన్, కృష్ణయ్య, బాల్‌రాజ్ తెలిపారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్
- రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ



దుద్యాల్: రైతు సదస్సులో మాట్లాడుతున్న తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

దుద్యాల్: భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం దుద్యాల్‌లో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో మాట్లాడారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా ఫిర్యాదులు చేసుకోవాలన్నారు. వివిధ సమస్యలపై 80 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ కిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ వీరేశ్ బాబు, ఆర్ఐ నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: భూ భారతి సదస్సులతో సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ బి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రుద్రారం, నాగారం గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు అనిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదస్సులు..

దౌల్తాబాద్: రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. మాటూరు, నాగసార్ గ్రామంలో దరఖాస్తులు స్వీకరించారు. భూ రికార్డుల సవరణ, విస్తీర్ణంలో మార్పులు, సాదాబైనామాలు తదితర సమస్యలకు దరఖాస్తులు అందజేస్తే పరిష్కరిస్తామని తహశీల్దారు గాయత్రి తెలిపారు. డీటీ చాంద్‌పాష, ఆర్ఐ సునిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కీలకం

కుల్కచర్ల: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని కుల్కచర్ల కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య అన్నారు. తిర్మలాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన నూతన తహశీల్దార్ మనోహర్ చక్రవర్తిని ఘనంగా సన్మానించారు. డీటీ చంద్రశేఖర్, స్థానికులు చిన్నయ్య, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: భూ భారతితో సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహశీల్దారు రవీందర్ పేర్కొన్నారు. అంరాధికలాన్, అంరాధికుర్దు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. రెండు గ్రామాల్లో కలిపి 67 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

పూడూరులో...

పూడూరు: భూ భారతితో రైతులకు మేలు జరుగుతుందని తహశీల్దార్ భరత్‌గౌడ్ పేర్కొన్నారు. చింతలపల్లి, పుడుగుర్తి, మేడికొండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు.

దోమలో..

దోమ: రైతుల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ గోవిందమ్మ అన్నారు. లింగస్‌పల్లి, కిష్టాపూర్‌లలో రెవెన్యూ సదస్సులను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ నర్సింహులు, ఆర్ఐలు సుదర్శన్, రాంచంద్రరావు పాల్గొన్నారు.



కుల్కచర్ల: తహశీల్దార్ మనోహర్ చక్రవర్తి, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వెంకటయ్య, స్థానిక నాయకులు



కొడంగల్ రూరల్: రుద్రారం గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ విజయకుమార్

శాస్త్రీయ పద్ధతులతో దిగుబడులు

వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి

కుల్కచర్ల: శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికంగా రసాయనాలు వాడటం వల్ల దిగుబడి కనిపించినప్పటికీ భవిష్యత్‌లో భూ సారం కోల్పోవడంతో దిగుబడి తగ్గిపోతుందన్నారు. శాస్త్రీయ పద్ధతులతో వ్యవసాయం చేస్తే ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల వ్యవసాయాధికారి వీరస్వామి, పరిగి వ్యవసాయ సంచాలకులు లక్ష్మికుమారి, ఏఈఓలు బాబు, నిఖిత, వంశీ, విశ్వనాథ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, సత్యనారాయణ, క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి

క్షయపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మజిద్‌ఖాన్

వైద్యాధికారి మజిద్‌ఖాన్

బంట్వారం: క్షయపై అప్రమత్తంగా ఉండాలని బంట్వారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మజిద్‌ఖాన్ పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం తొర్మామిడిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. రక్తపోటు, హెచ్ఐవీ, టీబీ, మధుమేహం, ఆల్కహాల్, దూమపానం తదితర అంశాలపై ఆయన వివరించారు. టీబీ నిర్ధారణ పరీక్షల కోసం పలువురిని తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వ్యాధికి గురైనట్లు నిర్ధారిస్తే ఆరు నెలల వరకు ఉచితంగా మందులతో పాటు నెలకు రూ.వెయ్యి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ నివారణ అధికారి రవీంద్రయాదవ్, డాక్టర్ వందన, సీహెచ్ఓ విజయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

అనంతగిరి: ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని సిద్దులూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దులూర్ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 120మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. టీబీ ముక్త్ అభియాన్‌లో భాగంగా క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 27వ వార్డు న్యూసిటీ కాలనీలో ఉన్న పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా వందరోజుల ప్రణాళిక ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిషేధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



న్యూసిటీ కాలనీ పార్కులో మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ సునీత, నాయకులు, సిబ్బంది

వైద్య శిబిరానికి విశేషస్పందన

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య సహాయకులు కొత్త్రి మల్లేశ్, శ్రావణిలు 174 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని వీరసముద్రంలో గురువారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకుడు ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య సీతారామస్వామి, శివలింగం, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాభిశిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు దాన్యధివాసం, జలాధివాసం, శయ్యాధివాసం నిర్వహించడంతో పాటు ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.



హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆరోగ్య ఉపకేంద్రంలో.. పీహెచ్‌సీ

- సౌకర్యాల ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయింపు
- భవనాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ

యాచారం: నందివనపర్తిలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు కానుంది. దీంతో ఆ గ్రామంతో పాటు అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, పిల్లిపల్లి, మలీక్‌జ్‌గూడ, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. అంతే కాకుండా మండల కేంద్రం యాచారం వెళ్లాల్సిన అవసరం ఉండదు. గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు లేఖ రాసారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

రూ.20 లక్షల నిధులతో...

ప్రస్తుతం నందివనపర్తిలో కొనసాగుతున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయనున్నారు. అందుకు అనుగుణంగా రూ.20 లక్షలతో ఆ భవనాన్ని మరమ్మతు చేయనున్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించనున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. పీహెచ్‌సీకి కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు.



నందివనపర్తి ఆరోగ్య ఉప కేంద్రం

యాచారం నుంచి తరలింపు

మండల కేంద్రంలోని ఒకే భవనంలో ప్రస్తుతం వైద్య విధాన పరిషత్ (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కొనసాగుతున్నాయి. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకే చోట కొనసాగడంతో ఏ శాఖ సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారో తెలియడం లేదు. అంతే కాకుండా ఒకే చోట కాకుండా.. ఇక్కడి నుంచి మరో గ్రామానికి పీహెచ్‌సీని తరలిస్తే.. ఆ పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ అవుతాయని భావించారు. ఈ నేపథ్యంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన నందివనపర్తిలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని నిర్ణయించారు. పీహెచ్‌సీ ఏర్పాటు అనంతరం.. యాచారం పీహెచ్‌సీ సిబ్బందినే అక్కడికే తరలించి, ప్రజలకు వైద్య సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయనున్నామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.